సాక్షి అనకాపల్లి

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



ధనుర్బాణ దర్శనం

విశాఖ: ఉక్కునగరం సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అయోధ్య శ్రీరామ చంద్రస్వామి ధనుర్బాణాన్ని దర్శించుకున్నారు.



భారీ వర్షం

బుచ్చెయ్యపేట మండలంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి. 8లో




ఏయూ హాస్టళ్ల తనిఖీ

విశాఖ: ఏయూ హాస్టళ్లు, మెస్‌లను సోమవారం రెక్టార్ కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్‌బాబు తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

పెద్దేరు జలాశయానికి పెరిగిన వరద నీరు



మాడుగుల: అత్యంత జలవనరులు గల పెద్దేరు రిజర్వాయర్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షంతో ఇన్‌ఫ్లో పెరిగింది. జలాశయంలోకి ప్రస్తుతం 100 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో 120 క్యూసెక్కుల నీటిని ప్రధాన గేట్ల ద్వారా విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం జలాశయం 135 మీటర్లకు చేరింది. జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పెద్దేరుకు వరద నీరు పెరుగుతుండడంతో జలాశయం నుంచి నీటిని ఏ సమయంలోనైనా విడుదల చేయవచ్చు. దీంతో రాత్రి పూట రైతులు, పెద్దేరు ఏటి బాధిత గ్రామాల ప్రజలు పెద్దేరులో దిగరాదని జలాశయం అధికారులు హెచ్చరించారు.

29న ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు తుమ్మపాల క్రీడా మైదానంలో జరుగుతుందని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి జయవీర్, సీహెచ్‌ఎల్‌ఎం శ్రీనివాసరావులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి 34వ అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు సెప్టెంబర్ 18, 19, 20 తేదీల్లో ప్రకాశం జిల్లా జె.పంగులూరులో జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జార్ఖండ్ రాష్ట్రంలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 14 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, బరువు, ఎత్తు, వయసు 215 పాయింట్లకు మించకూడదని వారు తెలిపారు.

మమ్మల్ని రోడ్డున పడేయకండి

- ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగుల ఆందోళన



దిమిలి రోడ్డు కూడలి వద్ద ఆందోళన చేస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు

యలమంచిలి రూరల్: ఐదేళ్లుగా పొందుతున్న ఉపాధిని నిలిపి తమను రోడ్డున పడేయవద్దని కోరుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం పట్టణంలో ఆందోళన చేశారు. ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ అమల్లోకి తెస్తే తామంతా ఉపాధి కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3500 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సుమారు 15 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, వారి పరిస్థితి అర్థం చేసుకుని కూటమి ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణాల ఉద్యోగుల సంఘం నాయకుడు వెంకటరమణ కోరారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సర్కిల్ పరిధిలో ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

11న అరసం జిల్లా మహాసభ

అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా 11వ మహాసభను వచ్చే నెల 11న స్థానిక శాఖవీధి శాఖా గ్రంథాలయలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల వీరభద్రరావు చెప్పారు. గ్రంథాలయం ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌లు హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు.

విశాఖలో సినీ నటుడు రజినీకాంత్ సందడి



గోపాలపట్నం (విశాఖ): విశాఖ విమానాశ్రయంలో సినీ నటుడు రజినీకాంత్ సోమవారం సందడి చేశారు. విశాఖలో జరిగే షూటింగ్‌లో పాల్గొనేందుకు చెన్నై నుంచి వచ్చారు. విమానాశ్రయంలో ఆయన్ని చూడగానే అభిమానులు, ప్రయాణికులు కేరింతలు కొట్టారు. సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం ఆయన రాడిసన్ బ్లూ హోటల్‌కు బయలుదేరి వెళ్లారు.

రక్షణ ఎంతో అవసరం



పగలనక రాత్రనక సేవలందించే డాక్టర్లు, వైద్య సిబ్బందికి రక్షణ ఎంతో అవసరం. వైద్యం చేస్తున్న సమయంలో అసంతృప్తికి లోనైన రోగుల బంధువులు దుర్భాషలాడుతున్న ఘటనలు చూస్తున్నాం. కొన్ని సందర్భాల్లో దాడులకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలతో వైద్యాధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వీరికి భరోసా ఇచ్చేందుకు ఆస్పత్రుల వద్ద వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలి.

–డాక్టర్ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్, కె.కోటపాడు సీహెచ్‌సీ



నెల రోజుల్లో శిక్షించాలి



కోల్‌కతా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులను నెల రోజుల్లో శిక్షించాలి. అప్పుడే దేశంలో మరెక్కడా అటువంటి ఘటనలు జరగవు. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులతోపాటు వైద్య సిబ్బందిపై దేశంలో నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నాయి. వాటిని అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుంది. రాత్రి సమయంలో విధులు నిర్వహించే వైద్యులు, వైద్య సిబ్బందికి పూర్తి స్థాయి రక్షణ కల్పించాలి.


–వి.మానస, స్టాఫ్ నర్స్, కె.జె.పురం పీహెచ్‌సీ, మాడుగుల మండలం

కె.కోటపాడు/మాడుగుల రూరల్:

బాల గోకులం



శ్రీకృష్ణుని అవతారంలో కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి



చిట్టి పొట్టి చిన్నారులంతా బుడి బుడి అడుగులు వేస్తూ వచ్చారు. చేతిలో మురళి, తలపై నెమలి పింఛంతో బాల కృష్ణులు కనువిందు చేశారు. గోపిక వేషం వేసిన కొందరు బాలికలు బాల గోకులానికి నిండుదనం చేకూర్చారు. కృష్ణాష్టమి సందర్భంగా ప్రతి ఇంటా గీతాచార్యుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మురళీధరుడి విగ్రహాన్ని చక్కగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చిన్నారులకు గోపికా కృష్ణుల వేషాలు వేసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఉట్టి కొట్టే ఆటలతో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సందడి చేశారు.

–సాక్షి న్యూస్ నెట్‌వర్క్



అనకాపల్లిలోని ఒక పాఠశాలలో ఉట్టి కొడుతున్న శ్రీకృష్ణ వేషధారి



అనకాపల్లి గౌరీ పంచాయతన దేవాలయంలో బాల గోకులం



కశింకోటలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చిన్నారుల సందడి

ఏయూ రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ధనుంజయరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగం ఆచార్యులు ఇ.ఎన్.ధనుంజరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు నుంచి ఉత్తర్వులు స్వీకరించారు. రెక్టార్‌గా ఇప్పటివరకు రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన ఎస్.కిశోర్‌బాబు నియమితులయ్యారు. అలాగే అకడమిక్ ఎఫైర్స్ డీన్‌గా కె.ఈశ్వర్‌కుమార్, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా చల్లా రామకృష్ణ, సీడీసీ డీన్‌గా టి.వి.కృష్ణ, స్టూడెంట్ అఫైర్స్ ఇంచార్జ్ డీన్‌గా డాక్టర్ జి.రాంబాబు, ఏఈఆర్‌సీ గౌరవ డైరెక్టర్‌గా డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె.వెంకటరమణలను నియమించారు.

తాండవ ప్రాజెక్టుకు పొంచి ఉన్న ముప్పు



మెయింటెనెన్స్ లేకుండా ప్రధాన గేట్ల ఐరన్ తాడు



తెగిపోయిన తాండవ గేటు ఐరన్ తాడు

- తెగిపోయిన ప్రధాన గేట్ల ఐరన్ తాడు
- అడుగుకు జారి పోయిన ఒకటో గేటు
- రెండు గేట్ల ద్వారానే ఆయకట్టుకు నీరు

నాతవరం: తాండవ రిజర్వాయరు ప్రధాన గేట్లు ఆపరేట్ చేసే ఐరన్ తాడు తెగిపోవడంతో ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల చేసేందుకు మూడు ప్రధాన గేట్లు ఉన్నాయి. అందులో ఒకటో ప్రధాన గేటు ఎత్తడానికి, దించేందుకు అమర్చిన ఐరన్ తాడు తెగిపోయింది. దీంతో ఆ గేటు కిందకు జారి పోయి నీరు ప్రవహించడం లేదు. రెండు గేట్ల ద్వారా మాత్రమే ఆయకట్టుకు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వాస్తవంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల చేసే ముందు వేసవిలో ప్రధాన గేట్లకు మరమ్మతులు చేపట్టాలి. ఐరన్ తాడుకు గ్రీజు రాసి ముందుగా ట్రయల్ రన్ నిర్వహించాలి. ఈ ఏడాది ఆ విధంగా చేయకపోవడంతో గేట్ల ఐరన్ తాడు శిథిలమై తెగిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.

ప్రమాద స్థాయికి చేరువలో నీటిమట్టం

ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో నీటిమట్టం 377.4 అడుగుల ప్రమాద స్థాయికి చేరువులో ఉంది. తాండవ ప్రాజెక్టు ప్రమాదస్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా.. 378 అడుగులకు వచ్చే సరికి ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తారు. తాండవ నదీలోకి స్పిల్‌వే గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తారు. ఈ నేపథ్యంలో ఒకటో గేటు కిందకు జారి పడిపోవడంతో ఆయకట్టు భూములకు రెండు గేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నారు. మూడు గేట్ల ద్వారా సమానంగా నీటిని విడుదల చేస్తే గేట్లకు ఎలాంటి ఢోకా ఉండదు. మూడు గేట్ల ద్వారా ప్రవహించే నీటిని రెండు గేట్ల ద్వారా విడుదల చేస్తే నీటి ఉధృతికి గేట్లు వంగిపోయే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో నీరు 400 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులోకి చేరుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ప్రాజెక్టు నుంచి నీటిని ఈ నెల 19న విడుదల చేశారు. అప్పుడు ప్రధాన గేటు ఐరన్ తాడు తెగిపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడును వివరణ కోరగా.. తాండవ ప్రధాన ఒకటో గేటు ఐరన్ తాడు తెగిపోవడంతో మిగతా రెండు గేట్ల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అనుభవం ఉన్న మెకానికల్ ఇంజినీర్లతో ఈ గేటుకు మరమ్మతులు చేయాలని నెల్లూరు జిల్లాలో ఉన్న ఇంజినీర్‌ను తీసుకువచ్చి పనులు చేస్తామన్నారు.

ఆగని ఇసుక దందా

- హోం మంత్రి ఇలాకాలోనే అక్రమ తవ్వకాలు
- పోలీసులు పట్టుకున్నా పట్టించుకోని మాఫియా
- ఏపీఐఐసీ భూముల్లో తవ్వకాలు.. జీడితోటల్లో నిల్వలు
- కూటమి నేతల అండతో చెలరేగిపోతున్న ఇసుకాసురులు



డీఎల్‌పురంలో ఏపీఐఐసీ భూముల్లో ఇసుక తవ్విన ప్రదేశం, (ఇన్‌సెట్) తవ్వకాలు జరిపిన ఇసుకను జీడితోటల్లో నిల్వ చేసిన దృశ్యం

నక్కపల్లి: మండలంలో తీరప్రాంత గ్రామాల్లో ఇసుక దందా ఆగడం లేదు. కూటమి నేతల అండదండలతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. మండలంలో డీఎల్‌పురం, అమలాపురం, గునిపూడి సముద్ర తీరం నుంచి ఇసుక తవ్వి అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను రెండు రోజుల క్రితం పోలీసులు పట్టుకుని సీజ్ చేసి జరిమానా విధించినప్పటికీ అక్రమార్కులు తగ్గడం లేదు. యథావిధిగా తమ అక్రమాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ వారు సేకరించి నష్టపరిహారం చెల్లించిన భూముల్లోనే ఈ ఇసుక దందా జరగడం గమనార్హం. జిరాయితీ భూముల తోపాటు, తీరప్రాంతానికి ఆనుకుని ఉన్న ఇసుక తిన్నెల్లో ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. నక్కపల్లి మండలంలో అమలాపురం, పాటిమీద, మూలపర, చందనాడ, డీఎల్‌పురం, గునిపూడి గ్రామాలు, పాయకరావుపేట మండలంలో తాండవ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న పెంటకోట, మాసయ్యపేట, అరట్లకోట, రాజవరం, రాజానగరం, వెంకటనగరం, పాల్మన్‌పేట గ్రామాలు, ఎస్.రాయవరం మండలంలో రేవుపోలవరం, బంగారమ్మపాలెం, గుడివాడ, పెద ఉప్పలం, చిన ఉప్పలం, ఉప్పరాపల్లి తదితర తీరప్రాంతాల్లో ఇసుక ఇసుక తిన్నెలను మాఫియా దోచేస్తోంది. పొక్లెయిన్ల సాయంతో తవ్వకాలు జరిపి డీఎల్‌పురం, అమలాపురం, వేంపాడు సమీపంలో ఉన్న జీడి తోటల్లో నిల్వ చేస్తున్నారు. ఇలా వేలాది టన్నుల ఇసుకను రాత్రి వేళ అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు విక్రయిస్తున్నారు. ఇలా డీఎల్‌పురం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను పోలీసులకు అందిన సమాచారం మేరకు పట్టుకుని కేసులు నమోదు చేసి పెనాల్టీ వసూలు చేశారు. అయినప్పటికీ ఈ దందా కొనసాగుతూనే ఉంది.

అధికార కూటమి అండదండలు

గత కొద్దిరోజులుగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికార పార్టీలో ఉన్న స్థానిక నాయకులతోపాటు, పొరుగు నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకుల అండదండలు ఉన్నట్లు సమాచారం. విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా 5 వేల ఎకరాల జిరాయితీ, డీ ఫారం భూములు సేకరించింది. ఈ భూములకు పదేళ్ల క్రితమే నష్టపరిహారం చెల్లించింది గానీ భూములు స్వాధీనం చేసుకోలేదు. అవి రైతుల ఆధీనంలోనే ఉన్నాయి. తీరానికి ఆనుకుని ఉన్న డీఎల్‌పురం, చందనాడ, అమలాపురం, పాటిమీద, మూలపర, గునిపూడి గ్రామాల పరిధిలోని ఈ భూముల్లో ఇసుక, గ్రావెల్ పుష్కలంగా లభిస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకుని అక్రమార్కులు తవ్వకాలు జరిపి విక్రయించి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈ ఇసుక గ్రావెల్ మాఫియాను ఏపీఐఐసీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని చెబుతుండగా ఆ పార్టీల ఆధీనంలో నడుస్తున్న మాఫియా మాత్రం ఈ ఇసుకను లారీ (30 టన్నులు) రూ.35 వేల నుంచి రూ.40 వేలకు విక్రయిస్తోంది. ఎవరైనా సమాచారం ఇచ్చి, ఫిర్యాదు చేస్తేనే తప్ప పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఈ ఇసుక మాఫియాపై కన్నెత్తి చూడటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక, గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని పదేపదే చెబుతున్న హోం మంత్రి అనిత ఇలాకాలో ఉన్న డీఎల్‌పురం కేంద్రంగానే ఈ ఇసుక అక్రమ రవాణా భారీ స్థాయిలో జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రకటనలు కాదని.. కార్యాచరణ ఏదని ప్రశ్నిస్తున్నారు.

జీవనాధారానికి అడ్డు‘గోడ’

- పెదకలవలాపల్లి కొండ చుట్టూ నేవీ రక్షణ ప్రహరీ నిర్మాణం
- జీవనాధారం కోల్పోతున్నామంటూ గ్రామస్తుల ఆందోళన



పెదకలవలాపల్లిలో నేవీ ప్రహరీ నిర్మాణ పనులకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న గ్రామ ప్రజలు

రాంబిల్లి(యలమంచిలి): తరతరాలుగా కొండను నమ్ముకొని జీవనం సాగిస్తున్న పెదకలవలాపల్లి గ్రామ ప్రజలకు నేవల్ బేస్ రక్షణ గోడ నిర్మాణం రూపంలో వారి జీవనం ప్రశ్నార్థకంగా మారింది. ఒక వైపు దేశ రక్షణ రంగంలో ఆయుధ సంపత్తిని రహస్యంగా శత్రు దేశాలకు తెలియకుండా భద్రపరచడానికి కేంద్ర ప్రభుత్వం రాంబిల్లి మండలం సముద్ర తీర ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా కొన్నేళ్లుగా నిర్మాణ పనులు చురుగ్గా సాగిస్తోంది. నేవల్ బేస్ పరివాహక ప్రాంతాల పరిధిలోని పెదకలవలాపల్లి గ్రామాన్ని ఆనుకుని ఉన్న అటవీ శాఖ ఆధీనంలో ఉన్న కొండను నేవల్ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. అయితే తరతరాలుగా పెదకలవలాపల్లి గ్రామ ప్రజలు ఇక్కడ కొండ మీద జీడి మామిడి, తదితర తోటలు పెంచుకుంటూ ఫలసాయం పొందుతున్నారు. కొండపై పాకలు వేసుకుని పశువులు, మేకల పెంపకం చేపడుతున్నారు. గ్రామస్తులు కొండ నుంచి కలప, వంట చెరకు తెచ్చుకుని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొండ చుట్టూ రక్షణ గోడ నిర్మాణంతో గ్రామస్తులకు దారి లేకుండా పోయింది. గ్రామానికి సమీపంలో ఉన్న శారదానది వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. అటువంటి సమయంలో గ్రామంలో పలు ఇళ్లు ముంపునకు గురవుతుంటాయి. అప్పుడు తలదాచుకోవడానికి గ్రామస్తులకు ఈ కొండే దిక్కు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన గ్రావెల్, రాయి ఈ కొండ నుంచే తెచ్చుకుంటారు. ప్రస్తుతం నేవల్ బేస్ రాకతో కొండ చుట్టూ ప్రహరీ నిర్మాణంతో తమ గ్రామానికి ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెదకలవలాపల్లి నుంచి దిమిలి, రజాల, మురకాడ వంటి గ్రామాలకు ఈ కొండ పక్క నుంచి వెళ్లడానికి దారులు ఉన్నాయని, ఇప్పుడు అవి మూసుకుపోతున్నాయని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు.

నేవీ ప్రహరీతో ఉపాధి కరువు

నేవల్ బేస్ రక్షణ గోడ నిర్మాణంతో పెదకలవలాపల్లి గ్రామ ప్రజలకు ఉపాధి కరువైంది. ఇక్కడున్న కొండను నమ్ముకొని తరతరాలుగా ప్రజలు జీవనం పొందుతున్నారు. పంట భూములకు ఉన్న మార్గాలను నేవీ అధికారులు మూసి వేశారు. పెదకలవలాపల్లి గ్రామాన్ని నిర్వాసిత గ్రామంగా ప్రభుత్వం గుర్తించి ఉపాధి కల్పించాలి.

– జి.దేముదునాయుడు, సీఐటీయూ రాంబిల్లి మండల కన్వీనర్



నేవీ కడుతున్న ప్రహరీ

300 రోజులకు పైగా నిరసన దీక్షలు

నేవీ రక్షణ గోడకు వ్యతిరేకంగా గత 300 రోజులకు పైగా గ్రామస్తులు నిరసన దీక్షలు చేస్తున్నారు. వీరికి మద్దతుగా స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావి దేముళ్లు నాలుగు రోజులుగా గ్రామంలో నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. గ్రామంలోకి వచ్చే వాహనాలను అడ్డుకొని ప్రజలు ఆందోళనను ఉధృతం చేశారు.

కొండే ప్రజలకు జీవనాధారం

పెదకలవలాపల్లికి సమీపంలో ఉన్న కొండ మీద ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. కొండ చుట్టూ రక్షణ గోడ నిర్మించడంతో ఎవరూ కొండపైకి వెళ్లలేక ఉపాధి కోల్పోతున్నాం. దహన సంస్కారాలకు అవసరమైన కలపను గతంలో కొండకు వెళ్లి తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు కలక కోసం ఇబ్బందులు పడుతున్నాం. నేవీ ప్రాజెక్ట్ తమ బతుకుల్లో చీకటి నింపింది. ప్రభుత్వాధికారులు వస్తున్నారు.. వెళ్తున్నారు తప్పా సమస్యలు పట్టించుకోవడం లేదు.

– రావి శివలోవలక్ష్మి, పెదకలవలాపల్లి గ్రామం

ఎంపీటీసీ మాజీ సభ్యుడు దేముళ్లు దీక్ష భగ్నం

నేవీ ప్రహరీ నిర్మాణానికి వ్యతిరేకంగా నాలుగు రోజులుగా పెదకలవలాపల్లి గ్రామంలో చేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావి దేముళ్ల నిరవధిక నిరాహార దీక్షను రాంబిల్లి పోలీసులు ఆదివారం అర్ధరాత్రి భగ్నం చేశారు. ఆయనను రాంబిల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గోడ నిర్మాణం వల్ల నష్టపోతున్న గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరుతూ దీక్షకు దిగిన ఆయన ఆరోగ్యం క్షీణించడంతో పోలీసులు ఆస్పత్రికి బలవంతంగా తరలించారు. దీంతో సోమవారం గ్రామ ప్రజలు రోడ్డుపై బైఠాయించి నేవీ రక్షణ గోడ వద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, సీఐటీయూ నేతలు మాట్లాడుతూ అధికారులు, కూటమి ప్రభుత్వం నేతలు తమ సమస్యలపై కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన ఎమ్మెల్యే కూడా ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న పరిస్థితులపై ఆరా తీయలేదన్నారు. అధికారులు స్పందించి తక్షణం తమకు న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

పాత పెన్షన్ విధానం కోసం ఉద్యమిద్దాం

డాబాగార్డెన్స్(విశాఖ): పాత పెన్షన్ విధానం, 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఐక్యంగా ఉద్యమిద్దామని సిటూ అఖిల భారత కార్యదర్శి కేఎస్ ఉమేష్ పిలుపునిచ్చారు. డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ నేతృత్వంలో సోమవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 8వ వేతన సంఘం ఏర్పాటు, ఓపీఎస్ సాధన కార్మిక వర్గ పాత్రపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ విధానంపై దేశంలోనే తొలిసారిగా సదస్సు నిర్వహించిన విశాఖపట్నం డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీని అభినందించారు. దేశంలో త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అక్కడ లబ్ధి పొందేందుకు ఏకీకృత పెన్షన్ విధానాన్ని ప్రకటించిందన్నారు. పెన్షన్ భిక్షం కాదని, కార్మికుల హక్కు అని సుప్రీంకోర్టు విశదీకరించిందని, 20 ఏళ్ల సుదీర్ఘ పోరాటాలు ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందని ఏఐడీఇఎఫ్ మాజీ అదనపు కార్యదర్శి గుహతకుర్తా గుర్తు చేశారు. రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ డివిజన్ కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ మాకు ఆమోదయోగ్యం కాదన్నారు. రాష్ట్ర సిటూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టీఎన్టీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగార్జున, నేవల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర కార్యవర్గం రద్దు

సాక్షి,పాడేరు: దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర కార్యవర్గ కాలపరిమితి ముగియడంతో రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్టు ఈ సంఘ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ చెండా కేశవరావు ప్రకటించారు. విశాఖలోని గిరిజన భవన్‌లో ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం,ప్రధాన కార్యదర్శి ఎల్.బి.కామేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు, అల్లూరి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఉద్యోగ సమితి అధ్యక్షులు,ఇతర ప్రతినిధులు హాజరయ్యారు.గత రెండున్నర ఏళ్లగా దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర కమిటీ విజయవంతంగా నిర్వహించిన ఆదివాసీల హక్కులు,చట్టాల పరిరక్షణ పోరాటాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘ సలహాదారుడు కేశవరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 15న సంఘ నూతన కార్యవర్గం ఎన్నికను నిర్వహిస్తామని తెలిపారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో నిందితులను శిక్షించాలని దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలకడం అభినందనీయం. ఈ కేసును సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకోవడం హర్షణీయం. కొన్ని ప్రాంతాల్లో ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకుని నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి. రాత్రిళ్లు విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రులకు రోగులతో పాటు వారి బంధువులు వస్తుంటారు. అటువంటి సమయంలోవైద్య సిబ్బందికి కల్పించాలి.

– ఎస్ఎన్.నసీమ్, వైద్యురాలు, తుమ్మపాల పీహెచ్‌సీ, అనకాపల్లి మండలం

పోలీసుల పర్యవేక్షణ అవసరం



ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. మంచి వైద్యం అందించాలనే తపనతో ఎంతో సహనంతో వ్యవహరిస్తుంటారు. ఆ సమయంలో అత్యవసర వైద్యం కోసం రాత్రిళ్లు వచ్చే రోగులతోపాటు వారి బంధువులు పలుమార్లు వైద్య సిబ్బందితో వాగ్వాదాలకు దిగిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆస్పత్రి పరిసరాలతోపాటు గదుల వద్ద సీసీ కెమెరాలతో పాటు పోలీస్ గస్తీని రాత్రిళ్లు ఏర్పాటు చేయాలి.

– బి.పద్మావతి, హెడ్ సిస్టర్, సీహెచ్‌సీ, కె.కోటపాడు

– కె.కోటపాడు, అనకాపల్లి

వరి సాగులో సస్యరక్షణే కీలకం

- తెగుళ్లు సకాలంలో గుర్తించి నివారించాలి
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



యలమంచిలి పెంజెరువు సమీపంలో వరి నాట్లు వేస్తున్న రైతులు, (ఇన్‌సెట్) నాట్లు పూర్తి వేసిన వరి పంట

యలమంచిలి రూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో సస్యరక్షణ చర్యలే కీలకం. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి, వ్యవసాయాధికారుల సూచనలు పాటించి, నివారణ చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్‌లో 20,982 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు కేవలం 9,895 ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారు. రాంబిల్లి, యలమంచిలి, ఎస్. రాయవరం మండలాల్లో విస్తారంగా వరి సాగు చేస్తారు. ఈ సీజన్‌లో యలమంచిలి దాదాపు 11,087 వేల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, పోషక లోపాలు వాటికి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పలు సూచనలు చేశారు.

ఆకుముడత తెగులు..

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినేయడం వల్ల ఆకులు తెల్లబడతాయి. పంట పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో 2, 3 సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. వీటి నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.

సుడిదోమ..

వరి పంట అంకురం దశ నుంచి చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు సుడిదోమ వచ్చే అవకాశం ఉంది. గోధుమ వర్ణపు దోమలు దుబ్బులు అడుగున నీటి మట్టంపై ఉండి మొక్క రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల పైరు సుడులు తిరిగి ఎండిపోతుంది. సుడిదోమ వ్యాపిస్తే వరిపొలంలో దోమ ఉధృతి ఉన్న చోట పంట ఎండిపోతుంది. నాట్లు చేసేటప్పుడే ప్రతీ రెండు మీటర్ల పొడవుకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో బాటలు వదలాలి. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పొలం గట్లపై కలుపు నివారణ చేసుకోవాలి.

కాండం తొలుచు పురుగు..

నారుమడి నుంచి పూతదశ వరకు వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వు చనిపోవడం, పూత దశలో తెల్ల కంకులు ఏర్పడడం జరుగుతుంది. దీనివల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. నివారణకు కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు 10 కిలోలు వాడాలి.

ఆకు ఎండు, పాముపొడ తెగులు నివారణ..

బ్యాక్టీరియా వల్ల ఆకులకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి. చేను దుబ్బు దశలో ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు చనిపోతాయి. నివారణకు ఒక మిల్లీ లీటర్ ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పొట్టకుళ్లు తెగులు

ఆకు తొడిమపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. లోపలి కాండానికి విస్తరించి కణుపుల మధ్య భాగమంతా నల్లగా మారిపోతుంది. కాండం చీల్చి చూస్తే నల్లని శిలీంధ్రాల బీజాలు కనిపిస్తాయి. వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. నివారించేందుకు కార్బండిజమ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్టదశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారీ చేసుకోవాలి.

తుప్పు తెగులు(జింక్ లోపం)

నేలలో జింక్ లోపం ఉన్నప్పుడు పంటను తుప్పు తెగులు ఆశిస్తుంది. నాట్లు వేసిన 2 నుంచి 6 వారాల్లో ఆకు చివరలో ఈనెకు ఇరుపక్కలా తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగా పెళుసుగా మారిపోయి, వాటిని వంచగానే విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. పంటలో 3 లేదా 4 ఆకులతో ఈనె రాలిపోతుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం ఐదు రోజుల వ్యవధిలో రెండు లేక మూడు సార్లు తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

నీటి యాజమాన్యం

వరి పిలకలు వేసే దశలో పైరు దుబ్బు వేయడం పూర్తయ్యేవరకు పొలంలో 2 సెంటీమీటర్లు నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరిలో అధిక దిగుబడులు సాధించడానికి సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్నపాటి మెలకువలు అనుసరించడం వల్ల పెట్టుబడులు ఆదా అవడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. రైతులకు అవసరమైన ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. రైతులంతా సందేహాలుంటే రైతు భరోసా కేంద్రంలో గానీ మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గానీ సంప్రదించి తగు సూచనలు పొందవచ్చు.

– పొలిమేర మోహన్‌రావు, ఏవో, యలమంచిలి

గోవాడ ఫ్యాక్టరీ ఆధునికీకరణ హామీని నెరవేర్చాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్



దేవరాపల్లి: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న ఎంపీ ముందుగా మూతపడ్డ పరిశ్రమలను తెరిపించి మాట నిలబెట్టుకోవాలన్నారు. సోమవారం దేవరాపల్లిలో వెంకన్న మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 సహకార చక్కెర కర్మాగారాలు ఉన్నాయని, వీటిలో గోవాడ మినహా మిగిలినవన్నీ మూతపడ్డాయన్నారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా నాలుగు ఉండగా, వీటిలో మూడు మూత పడ్డాయన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పిస్తామన్న ఎంపీ మూత పడ్డ పరిశ్రమలను పట్టించుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. వీటిపై ఆధారపడ్డ లక్షలాది మంది రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి వాటిని తెరిపిస్తే లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు.

చక్కెర దిగుమతుల ఇబ్బందుల నుంచి దేశం బయట పడవచ్చునన్నారు. రాష్ట్రానికే ఆదర్శంగా ఉన్న గోవాడ ఫ్యాక్టరీ నష్టాల ఊబిలో కూరుకుపోతుందన్నారు. ఈ ఫ్యాక్టరీపై 24 వేల మంది సభ్య రైతులు ఆధారపడి ఉన్నారన్నారు. ఎంపీ పునరాలోచించి అనకాపల్లి ప్రాంత ప్రజలకు హాని కలిగించే ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

అసభ్యంగా ప్రవర్తించిన యువకునిపై కేసు

కె.కోటపాడు: విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన కింతాడ పంచాయతీ రామచంద్రపురానికి చెందిన యువకుడు కన్నూరు రాజు(30)పై కేసు నమోదు చేసినట్టు కె.కోటపాడు పోలీసులు సోమవారం తెలిపారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ వివరాల మేరకు... సింగన్నదొరపాలెం శివారు కొత్త అగ్రహారం గ్రామానికి చెందిన విద్యార్థిని(12) పాఠశాలకు రెండు రోజుల సెలవు కావడంతో తాతగారి ఊరు జోగన్నపాలెం వెళ్లింది. అక్కడ పొలం పనుల్లో భాగంగా శీతలపానీయాలు తీసుకెళ్తోంది. ఆ సమయంలో రోడ్డుపై అటువైపు బైక్ మీద వెళ్తున్న కన్నూరు రాజు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. విద్యార్థిని మెడపై చేయి వేసి ఈ విషయం ఎవ్వరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. అదేసమయంలో అటువైపు వస్తున్న పాదచారులను చూసి అతడు ఉడాయించాడు. ఈ మేరకు విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన రైతు మృతదేహం లభ్యం..



వరాహనది నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు (ఇన్‌సెట్) పోతురాజు మృతదేహం

కోటవురట్ల: మండలంలోని పందూరు వరాహనదిలో గల్లంతైన రైతు పెద పోతురాజు మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన ఆరుగురు గజ ఈతగాళ్లు, స్థానిక యువకులు సోమవారం ఉదయం 7 గంటల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రైతు తన పొలానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైన విషయం విదితమే. ఈ ప్రాంతంలోనే లోతుకు వెళ్లి సుమారు 3 గంటల పాటు గాలించడంతో మృతదేహాన్ని గుర్తించగలిగారు. తాళ్ల సాయంతో బయటకు తీస్తున్న క్రమంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతానికి వృద్ధురాలి మృతి



మృతురాలు అప్పలనర్సమ్మ(ఫైల్)

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు సోమవారం విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామానికి చెందిన భీమిని చినదేముడు భార్య అప్పల నరసమ్మ(65) సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పొలం పనికి వెళ్లింది. అక్కడ తన తల్లి పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లిపోయిందని ఆమె కుమారుడు గిరిబాబు భావించాడు. తీరా రాత్రికి ఇంటికి వచ్చి చూసేసరికి తల్లి కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడు ఇతర రైతులతో కలిసి వెళ్లగా, పొలంలో విగతజీవిగా కనిపించింది. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. అచ్యుతాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎండాడలో పూలు కోస్తుండగా మరో మహిళ...

కొమ్మాది: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఎండాడలో సోమవారం చోటు చేసుకుంది. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్‌లో గూడుపల్లి శ్రీనివాసరావు, ఆయన భార్య లక్ష్మీ సుజాత, కుమారుడు చరణ్‌తో కలసి నివాసం ఉంటున్నారు. ఆదివారం తన ఇంటి పక్కనే ఉన్న పాత భవనాన్ని ఓ వ్యక్తి జేసీబీ ద్వారా కూల్చివేశారు. ఈ క్రమంలో భూగర్భంలో విద్యుత్ ప్రవహించే అధిక ఓల్టేజ్ తీగలు తొలగించారు. ఇవి శ్రీనివాసరావు పూల మొక్కలపై పడిపోయాయి. ఇది గమనించని భార్య లక్ష్మీసుజాత పూలు కోసే క్రమంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందింది.

అద్భుతం ఈలపాట కచేరి



ఈల పాట కచేరి చేస్తున్న శివప్రసాద్

మద్దిలపాలెం (విశాఖ): విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి వార్షికోత్సవం సందర్భంగా కర్ణాటక ఈల పాట కళాకారుడు డాక్టర్.కె. శివప్రసాద్ బృందం అద్భుతంగా ప్రదర్శన అలరించారు. ఈ కార్యక్రమాన్ని ఈస్టర్ నేవల్ కమాండర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆఫీసర్ ఎం.మురళీ మోహన్, వీఎండీఏ అధ్యక్ష్య, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్. గుమ్ములూరి రాంబాబు, కృష్ణప్రసాద్ ప్రారంభించారు. అనంతరం రెండు గంటల పాటు ఈల పాటతో అందరిని ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై విద్వాన్ మావుదూరి సత్యనారాయణ శర్మ, మృదంగంపై రామకృష్ణ, తబలాపై గుణరంజన్, కీబోర్డు శ్రీలాల్‌కృష్ణ, సహకారం అందించారు.

శ్వాస ఆడక చిన్నారి మృతి



బిడ్డ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

చింతూరు: అస్వస్థతతో శ్వాస ఆడక మరో చిన్నారి మృతిచెందిన సంఘటన చింతూరు మండలం నర్సింగపేటలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దుమ్మిరి బాబూరావు, సుబ్బలక్ష్మి దంపతుల 45 రోజుల బాబు అశ్విన్‌కు ఆదివారం మధ్యాహ్నం వాంతులు, విరేచనాలు కావడంతో తల్లిదండ్రులు చింతూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చిన్నపిల్లల వైద్య నిపుణుడు బిడ్డను పరీక్షించి రెండు సిరప్‌లు ఇచ్చారని, మరో రెండు సిరప్‌లు బయట కొనుక్కోమని చెప్పారని బిడ్డ తండ్రి బాబూరావు తెలిపాడు. పరిస్థితి కొంత మెరుగు పడడంతో బిడ్డను తీసుకుని ఇంటికి వస్తుండగా తిరిగి శ్వాస ఇబ్బంది తలెత్తిందని తెలిపాడు. దీంతో బిడ్డను కూనవరం మండలం కోతులగుట్టలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని భద్రాచలం తీసుకెళ్లాలని సూచించినట్టు ఆయన చెప్పాడు. అంబులెన్స్‌లో రాత్రి 10 గంటలకు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుఝామున తమబిడ్డ మృతిచెందినట్లు తండ్రి బాబూరావు తెలిపాడు.

ఆర్థిక సదస్సు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ఈ నెల 29వ తేదీన జరగనున్న ఆర్థిక వ్యవస్థ–అమలు విధానం సదస్సును అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం నొవాటెల్‌లో జరగనున్న సదస్సు ఏర్పాట్లను జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్‌సాహెబ్‌లతో కలిసి సోమవారం కలెక్టర్ పరిశీలించారు. సదస్సుకు పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, ప్రతినిధులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్నందున ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదని ఆదేశించారు. వారికి కేటాయించే వసతి, భోజనం, రవాణా సదుపాయాలు పక్కాగా ఉండాలని తెలిపారు. జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, వైద్య తదితర విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బుచ్చెయ్యపేటలో భారీ వర్షం



వడ్డాది - పాడేరు రహదారిలో ఆటోపై పడిన విద్యుత్ స్తంభం



బుచ్చెయ్యపేట మండలం శింగవరంలో నీట మునిగిన పొలాలు

- వడ్డాదిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం, ఆటో ధ్వంసం
- పలు గ్రామాల్లో నీట మునిగిన పొలాలు

బుచ్చెయ్యపేట: మండలంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కుండపోతలా కురిసిన వర్షంతో పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి. గంటికొర్లాం, పీడీపాలెం, వడ్డాది, విజయరామరాజుపేట, లూలూరు, శింగవరం, చిన అప్పనపాలెం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పొలాలు నీట మునిగాయి. మొన్నటి వరకు ఎండలతో వర్షం కురవక రైతులు సాగునీటి కోసం అవస్థలు పడగా, ఇప్పుడు భారీ వర్షం కురవడంతో నీట మునిగిన పొలాలను చూసి తల్లడిల్లిపోయారు. వడ్డాది, పాడేరు రహదారిలో విద్యుత్ స్తంభం రోడ్డుపైకి వాలిపోయి ఆటోడ్రైవరు అధికారి కృష్ణ ఆటోపై పడటంతో దెబ్బతింది. స్థానికులు వెంటనే రోడ్డుకు ఇరువైపులా వాహనదారులను, పాదచారులను విద్యుత్ తీగలు దగ్గరకు రాకుండా అడ్డగించి, ఆ శాఖ అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేయించడంతో పెను ప్రమాదం తప్పింది. మరోవైపు పలురోడ్లపై గోతుల్లో వర్షం నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పెద్దేరు, తాచేరు, బొడ్డేరు, గుర్రపుగెడ్డ తదితర నదులతోపాటు ఆయా గ్రామాల్లో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మెరక ప్రాంత రైతులు వరి నాట్లు వేయడానికి ఈ వర్షం మేలు చేస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలకు వలస టీడీపీ నేత అడ్డంకులు

- మాడుగుల ఎమ్మెల్యే బండారుకు పార్టీ నేతల ఫిర్యాదు



మాడుగుల ఎమ్మెల్యే బండారుకు ఫిర్యాదు చేస్తున్న దేవరాపల్లి గ్రామ టీడీపీ నాయకులు

దేవరాపల్లి: సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన వలస నేత తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆ పార్టీ స్థానిక గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె దేముళ్లు సహా పలువురు కార్యకర్తలు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే బండారును ఆయన స్వగృహంలో సోమవారం వారు కలిసి ఫిర్యాదు చేశారు. దేవరాపల్లి దరి సంతతోటలోని సర్వే నంబర్ 175/4లో రోడ్డు విస్తరణ నిర్వాసితులతోపాటు స్థానికులైన తమకు 18 సెంట్ల స్థలాన్ని అధికారులు కేటాయించారన్నారు. ఈ స్థలంలో ఇళ్లు, పశువుల షెడ్లు నిర్మిస్తుండగా, సదరు వలస నేత కొంతమందిని రెచ్చగొట్టి అడ్డగిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రతిపక్షంలో తమను ఇదే వ్యక్తి నానా ఇబ్బందులకు గురి చేశాడని, ఇప్పుడు అధికార పార్టీలో ఉంటూ తమపై కక్ష సాధింపులు కొనసాగిస్తున్నాడని వాపోయారు. తన అనుయాయులకు తప్ప ప్రతిపక్షంలో టీడీపీ జెండా మోసిన పార్టీ శ్రేణుల పనులు అడ్డుకుని అణగదొక్కుతున్నాడని ఆరోపించారు. ఈ చర్యలను అడ్డుకోకుంటే దేవరాపల్లిలో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లడం ఖాయమని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారని వారు అన్నారు.

రూ.కోటి నష్టపరిహారానికి డిమాండ్

- ఎస్ఈజెడ్‌లోని సినర్జీస్ ప్రమాదంలో సూర్యనారాయణ మృతి
- బంధువులు, సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో ఇండస్ ఆస్పత్రి వద్ద ఆందోళన



ఇండస్ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతుడు సూర్యనారాయణ బంధువులు

మహారాణిపేట: ఫార్మాసిటీ ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రధానమంత్రి ప్రకటించిన రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ మృతుడు సూర్యనారాయణ బంధువులు, సీఐటీయూ నేతలు సోమవారం ఆందోళనకు దిగారు. జగదాంబ జంక్షన్ ఏరియాలో ఇండస్ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఫార్మాసిటీలో వరుస ప్రమాదాలన్నీ యాజమాన్యం హత్యలేనని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ విమర్శించారు. ఈ నెల 22న రాత్రి పరవాడ ఎస్ఈజెడ్‌లోని సినర్జీస్ కంపెనీలో రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు 60 శాతం పైబడి తీవ్ర గాయాలతో ఇండస్ హాస్పటల్‌లో చేరారు. వీరిలో ముగ్గురు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, విజయనగరానికి చెందిన సూర్యనారాయణ ఉన్నారు. ఇప్పటికే జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు మృతి చెందగా..సోమవారం సూర్యనారాయణ మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలున్నారు. అచ్యుతాపురంలోని ఎసైన్షియా ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు చెల్లించిన విధంగానే వీరికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని బంధువులతో కలిసి సీఐటీయూ నేతలు కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఫార్మా సిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణలు ఆందోళన నిర్వహించారు. ఇదిలావుండగా అంత్యక్రియల కోసం రూ.20వేలు, సూర్యనారాయణ మృతదేహాన్ని విజయనగరం తరలించేందుకు అంబులెన్స్‌ను సినర్జీస్ యాజమాన్యం ఏర్పాటు చేసింది.



వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని పాశవికంగా హత్య చేయడం శోచనీయం. ప్రభుత్వం సరైన భద్రత కల్పించకపోవడం వల్ల ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్య సిబ్బందికి భద్రత పెంచాలి. అరాచకానికి కారకులైన నిందితులను శిక్షించకుండా జాప్యం చేయడం తగదు. సత్వరమే వారిని శిక్షించాలి. మిగిలిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి.

– ఎం.సునీత, ఏఎన్ఎం, పీహెచ్‌సీ, కశింకోట

– అనకాపల్లి, కశింకోట



పటిష్ట చర్యలు తీసుకోవాలి



వైద్య సిబ్బందిపై దాడులు జరుగుతుంటే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోసే వైద్యులను రోగుల బంధువులు ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారం కేసులో నిందితులను తక్షణమే శిక్షించాలి. అప్పుడు మృతురాలి ఆత్మకు శాంతి కలగడమే కాకుండా కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుంది. మిగిలిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బందిపై దాడులు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి. – సత్యవేణి, ఎంఎల్‌హెచ్‌పీ, కోడూరు గ్రామం, అనకాపల్లి మండలం

నేడు వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు



కశింకోట: దేవాదాయ శాఖకు చెందిన స్థానిక వేణు గోపాలస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని జననం, బాల కృష్ణునికి ఊయల సేవ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. బుధవారం స్వామివారిని గ్రామంలో ఊరేగించి, ఉట్ల సంబరం నిర్వహించనున్నామన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

మొన్నటి వరకు కొండెక్కి కూర్చున్న టమాటా ధర దిగొచ్చిందన్న ఆనందంలో ఉన్న కొనుగోలుదారులకు ఇప్పుడు ఉల్లి ఘాటెక్కిస్తోంది. దీనికి తామేం తక్కువ కాదన్నట్టుగా మిగిలిన కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దాంతో మార్కెట్లో ఏ కూరగాయ కొందామన్నా సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో ధరల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోంది.

- కంటతడి పెట్టిస్తున్న ఉల్లి
- గూబ గుభేల్‌మనిపిస్తున్న మిరప ధర
- వర్షాలతో ఇతర ప్రాంతాల్లో పంటలకు తీవ్ర నష్టం
- ధరల నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం



మెయిన్‌రోడ్డులో కూరగాయలు వ్యాపారం

కూరగాయలు	కిలో ధర
ఉల్లి	రూ.60
బీన్స్	రూ.90
పచ్చిమిర్చి	రూ.60

ఇతర కూరగాయల ధరలు కిలో రూ.30 నుంచి రూ.50 వరకూ పలుకుతున్నాయి. ఆకుకూరలు పది రూపాయలకు రెండు నుంచి మూడు కట్టలు మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి.

అనకాపల్లి: పట్టణంలోని కూరగాయల మార్కెట్లో ధరలు చుక్కలను చూపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో వర్షాలు ఎక్కువగా పడడంతో కూరగాయల పంటలకు నష్టం జరుగుతుంటే, అనకాపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో వర్షాలు లేక రైతులు వేసి పంటలు ఎండిపోయాయి. శ్రావణమాసం మొదలుకుని డిసెంబర్ వరకూ వివిధ రకాల పండగలు, శుభకార్యాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడే ధరలు ఇలా ఉంటే ముందు ఎలా అని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి తగ్గిన సరఫరా

అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు, మన రాష్ట్రంలో పొంగునూరు, పలమనేరు నుంచి టమాటా, కోల్‌కత్తా, ఇండోర్ నుంచి బంగాళదుంపలు, ఒడిశా నుంచి పచ్చిమిర్చి, తెలంగాణ నుంచి బీట్‌రూట్, క్యాప్సికమ్, క్యాబేజీ, రావులపాలెం నుంచి దొండకాయలు, దోసకాయలు లారీలు ద్వారా ఎక్కువగా వస్తుంటాయి. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురవడంతో అక్కడ పంటలకు నష్టం వాటిల్లింది. దాంతో ఉత్పత్తి తగ్గి సరఫరా లేకపోవడంతో ఇక్కడ కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణలో వైఫల్యం చెందుతోంది. ఇంతవరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కూరగాయలను దిగుమతి చేయడం, వంటి ఏర్పాట్లు చేయలేదు. అనకాపల్లి కూరగాయల మార్కెట్‌లో రోజుకు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు పూర్తి స్థాయిలో వచ్చినట్లయితే రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షలు లావాదేవీలు జరుగుతాయి. ప్రస్తుతం రోజుకు రూ.50 లక్షల వరకూ లావాదేవీలు మాత్రమే జరుగుతున్నాయి.

మండలంలో కూరగాయలు....

అనకాపల్లి మండలంలోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలు పంటలు పండుతాయి. విత్తనాలు వేసిన ప్రారంభంలో వర్షాలు లేకపోవడంతో చాలా వరకు నాటలేదు. ఇప్పుడు కొద్దో గొప్పో ఉన్న పంటలతో మార్కెట్లో డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో ఒక్కసారిగా గిరాకీ పెరిగిపోయింది.

కేజీకి అర కేజీయే కొనుగోలు



రెక్కడితే గాని డొక్కాడని కుటుంబంతో జీవనం సాగిస్తున్నాం. నిత్యావసర సరకులతోపాటు కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దాంతో మార్కెట్‌లో కేజీకి అరకేజీ కూరగాయలే కొనుగోలు చేయాల్సి వస్తోంది. రెండు మాసాల క్రితం టమాటా కొనుగోలు చేయాలంటే కరెంట్ షాక్‌లా ఉండేది. ఇప్పుడు ఉల్లి షాక్ ఇస్తోంది. కిలో ఉల్లి రూ.60లకు కొనుగోలు చేసుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఎస్.సత్తిబాబు, బవులవాడ, అనకాపల్లి మండలం

ధరలు పెరిగాయి



కూరగాయలు, ఆకుకూర ధరలు బాగా పెరిగాయి. వర్షాలు లేకపోవడంతో పంటలు సరిగా పండడం లేదు. నెల రోజులుగా రైతులు పండించిన కూరగాయలకు కొద్దిపాటి గిరాకీ పెరిగింది. పందులు సంచారంతో పొలాల్లో ఉన్న కూరగాయల పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

–శ్రీనివాసరావు, రైతు, రేబాక గ్రామం

రైతు బజార్లు ఏర్పాటు చేయాలి



అనకాపల్లి పట్టణంలో రైతు బజారు లేదు. రైతులు పండించిన పంట దళారుల పాలవుతోంది. రైతు వద్ద రూ.20కు కొనుగోలు చేసి దళారులు రూ.50 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. రైతు పండించిన పంట నేరుగా కొనుగోలుదారునికి చేరాలంటే రైతు బజార్లు ఏర్పాటు చేయాలి. ఈ విషయంలో కూటమి ప్రభుత్వంలో చిత్తశుద్ధి లేదు.

– ఎస్.కె.అలీ, నర్సింగరావుపేట, అనకాపల్లి

3వ రోజు నిలిచిన నీటి సరఫరా

కశింకోట: మండల కేంద్రంలో తాగునీటి ఇక్కట్లు వెంటాడుతున్నాయి. ఇక్కడ పలు ప్రాంతాల్లో మూడో రోజు సోమవారం ఇంటింటి కుళాయి నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోర్లు, బావుల వద్దకు పరుగులు తీస్తున్నారు. స్థానిక కోనేరు ప్రాంతంలో ఇంటింటి కుళాయికి వెళ్లే పైపులైన్ దెబ్బ తినడం వల్ల మూడు రోజులు క్రితం నీటి సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి గోవిందరావు కాలనీ, హౌసింగ్ కాలనీ, అఫీషియల్ కాలనీ, అగ్రహారం, భవాని కాలనీ ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. సత్వరమే నీటి సరఫరా పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కోనేరు వద్ద పైపు లైన్ మరమ్మతులు వెంటనే చేపట్టి మంగళవారం లోగా తాగునీటి సరఫరా పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టనున్నట్లు నీటి ప్రాజెక్టు సిబ్బంది తెలిపారు.







గోకుల కృష్ణా .. గోపాల కృష్ణా

- వేడుకగా కృష్ణాష్టమి
- రాధాకృష్ణ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

దారి పొడవునా కోలాటం.. చిన్నికృష్ణుల కోలాహలం.. భక్తుల గీతాలాపనలతో పురవీధుల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. కృష్ణ భక్తులు దేవదేవుని స్మరిస్తూ ముందుకు సాగారు. భక్తులకు గీతా సారాన్ని బోధించారు. ఉత్సవంలో భాగంగా స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. పలు పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకగా నిర్వహించారు.



ప్రైవేటు స్కూల్లో శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు



శ్రీకృష్ణుడు ఊరేగింపు



హరేకృష్ణ సత్సంగ్ ఆశ్రమంలో ఉట్టికొడుతున్న యువత



శ్రీకృష్ణుడు ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



కశింకోట శ్రీకృష్ణ మందిరంలో కృష్ణునికి పూజలు చేస్తున్న అర్చకుడు

అనకాపల్లి: పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఉడ్‌పేట ప్రైవేటు స్కూల్లో గోకులాన్ని తలపించే విధంగా చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిట్టి పొట్టి చిన్నారులంతా బుడిబుడి నడకలతో రాధాకృష్ణ వేషధారులై పాఠశాలలకు విచ్చేసి చూపరులను విశేషంగా ఆకర్షించారు. ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు అన్నట్లు తల్లిదండ్రులు తమ చిన్నారుల వేషధారణను చూసి మురిసిపోయారు. అనంతరం చిన్నారులు ఉట్టిని కొట్టేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్, ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పంచాయతన దేవాలయంలో....

స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రావణమాసం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల రాధాకృష్ణ వేషధారణ పోటీలు, ఉట్టి ఉత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సహకారంలో వివిధ రకాల మిఠాయిలు, ఫలాలు స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

హరేకృష్ణ సత్సంగ్ ఆశ్రమంలో....

స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల ఎదురుగా హరేకృష్ణ సత్సంగ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారిని పల్లకిపై ఊరేగించారు. అనంతరం మహా అభిషేకం, పంచామృత, మహా కలశాభిషేకం, తులసీపూజ, సంధ్యా హారతి, శ్రీకృష్ణ లీలామృతం ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యశోదకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

కశింకోట: స్థానిక కోనేరు వద్ద వెలసిన శ్రీకృష్ణ మందిరంలో యశోదకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుని విగ్రహాన్ని పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించి వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక సీఐ స్వామినాయుడు దర్శించుకున్నారు. రాత్రికి కృష్ణుని విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి ఉట్ల సంబర నిర్వహించారు. బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఉట్లను సంప్రదాయంగా కొట్టారు. అనంతరం కృష్ణుని విగ్రహాన్ని శారదానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎంపీపీ పంచదార్ల లక్ష్మి, కోదండ రామాలయ కమిటీ మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి వైఏ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలోని వివేకానంద హైస్కూలులో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఆనందోత్సాహంతో ఉట్టి కొట్టడం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ప్రిన్సిపాల్ మళ్ల శైలజ, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణావతారంలో వేంకటేశ్వర స్వామి

కశింకోట: స్థానిక వేంకటేశ్వర ధ్యాన మందిరంలో స్వామివారు శ్రీకృష్ణావతారంలో సోమవారం కనువిందు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారిని కృష్ణునిగా అందంగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన, విశేష అర్చన, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్ఐ రాములమ్మ

అనకాపల్లి: సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో మదర్ థెరిసా 115 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి. రాములమ్మ మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎన్నో లక్షల మంది అభాగ్యులకు, కుష్టిరోగులకు విశేష సేవలందించిన గొప్ప మహనీయురాలు మదర్ థెరిసా అని కొనియాడారు. ఈమె సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశ అత్యున్నత పురస్కారం భారత రత్నతో గౌరవించిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

పెందుర్తి: విశాఖ–అరకు రోడ్డులోని పెందుర్తి నూకాలమ్మ ఆలయం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు. విజయనగరం జిల్లా వేపాడ మండలం జాకేరుకు చెందిన వి.హరికృష్ణ బతుకుతెరువు కోసం పెందుర్తి వచ్చాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పనిమీద బయటకు వెళ్లిన హరికృష్ణ తిరిగి వస్తున్న క్రమంలో టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడి, తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీ హెచ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.















